సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 12 । జనవరి । 2025



నేతన్నకు 'అభయహస్తం'
నేతన్నకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సంక్రాంతి కానుకగా నేతన్న భరోసా పథకాలకు ఆమోదం తెలిపింది. - 10లో



యువ వికాసం..
పరిశ్రమలు నెలకొల్పుతూ, నూతన ఆవిష్కరణలను సృష్టిస్తూ పలువురు యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. - 10లో



సీఎం ఫ్లెక్సీలకు పాలాభిషేకం
నూతన పథకాలు ప్రవేశ పెట్టడంతో హర్షం వ్యక్తం చేస్తూ చేనేత నాయకులు సీఎం ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. - 11లో

న్యూస్‌రీల్

ప్రత్యేక అతిథులుగా ఐదుగురికి ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, నల్లగొండ, గుర్రంపోడు, మునగాల : ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురిని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానిస్తూ కేంద్ర రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఐదుగురికి అవకాశం లభించింది. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు శివ నాయుడు, ఎస్.విష్ణు ఉన్నారు. వీరితో పాటు హస్తకళల విభాగం నుంచి నల్లగొండలోని బీసీ బాలికల కళాశాల విద్యార్థిని పి.శ్వేత, చేపల పెంపకంలో గుర్రంపోడుకు చెందిన వంపు స్వాతి, డాటర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన పల్లేటి సరస్వతి ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు.

అలుగుబెల్లిని గెలిపించాలి

భువనగిరి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు కోరారు. శనివారం భువనగిరిలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం , ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డి అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు వెంకటాచారి, మమత, కోశాధికారి ముత్యాలు, కార్యదర్శులు స్వామి, సుధర్మారెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, రవికుమార్, కరుణాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎస్‌ఆర్టీఆర్‌ఐ చైర్మన్



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ(ఎస్‌ఆర్టీఐ) నూతన చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి శనివారం శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. సంస్థ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఆయన వెంట చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు ఉన్నారు.

నేడు మోత్కూరుకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:30కు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10:30 గంటలకు మోత్కూరు చేరుకుని రక్తదాన శిబిరంలో పాల్గొంటారు. అనంతరం దత్తప్పగూడెంలో నిర్వహించే క్రీడా పోటీలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం నల్లగొండకు చేరుకుని కలెక్టరేట్‌లో మధ్యాహ్నం ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమావేశమై సంక్షేమ పథకాలపై సమీక్షించనున్నారు. సాయంత్రం 6:30కు హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

ప్రభుత్వంతో చర్చించి జీఓ ఉపసంహరింపజేయండి



సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట : తిరుమల తిరుపతి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున లైజన్ ఆఫీసర్‌గా పనిచేయడానికి నియమించిన ఉద్యోగికి.. యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి జీతభత్యాలు ఎలా ఇస్తారంటూ సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వంతో మాట్లాడి జీఓను ఉపసంహరింపజేయాలని కోరుతూ శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి విన్నవించారు. ఈ సదర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ.. యాదగిరి క్షేత్రం నుంచి నెలకు లక్ష రూపాయలు వేతనం ఇవ్వాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సీఎం కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, కో ఆప్షన్ సభ్యులు పెంటయ్య తదితరులు ఉన్నారు.

దారులపై బారులు





సంక్రాంతి పండుగకు హైదరాబాద్ వాసులు సొంతూళ్లకు వెళ్తుండడంతో విజయవాడ హైవేపై చౌటుప్పల్ పట్టణంలో, పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు



వరంగల్ హైవేపై గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

కాంగ్రెస్ X బీఆర్‌ఎస్

ఇరుపార్టీల మధ్య తారాస్థాయికి మాటల యుద్ధం

- సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి పరుష పదజాలం
- యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూ కార్యకర్తల ఆగ్రహం
- బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి, ఫర్నిచర్, కిటికీల అద్దాలు ధ్వంసం
- ఆలేరులో ఐలయ్య, గొంగిడి సునీత మధ్య కొనసాగుతున్న వార్

సాక్షి,యాదాద్రి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో కాకపుట్టించాయి. కంచర్ల వ్యాఖలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూ కార్యకర్తలు భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై దాడి చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య కొంతకాలంగా సాగుతున్న మాటలయుద్ధం తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలతో పాటు ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భూ అక్రమాలకు పాల్పడ్డాడంటూ ప్రతిపక్ష బీఆర్‌ఎస్ విమర్శలు గుప్పిస్తుండగా.. కాంగ్రెస్ కూడా దీటుగా కౌంటర్లు ఇస్తోంది.

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి, ఉద్రిక్తత

భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు శనివారం దాడి చేశారు. మధ్యాహ్నం సమయంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రండ రాజకీయం చేస్తున్నారని, ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. దీంతో ఆగ్రహించిన యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్, కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలు, కిటికీల అద్దాలు, ఫ్లెక్సీలు ధ్వంసం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ కో ఆర్డినేటర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు మరికొందరు నాయకులు కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ధర్నా చేశారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి, అరెస్ట్‌చేయాలని ఫిర్యాదు చేశారు.పోలీసుల సమక్షంలో కార్యాలయంపై దాడి జరిగిందని, పోలీసులు దాడికి సహకరించారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. అనంతరం రైతుబజార్ వద్ద ధర్నాకు దిగారు. అక్కడ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భువనగిరిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంపై ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడంతో ధ్వసంమైన ఫర్నిచర్



భువనగిరిలోని రైతుబజార్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆలేరులోనూ వేడెక్కిన రాజకీయం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఆలేరు మండలం కొలనుపాక భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వెలుగులోకి తెచ్చారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వెనుక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హస్తం ఉందని మల్లన్న ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై మల్లన్న ఫిర్యాదుతో యాదగిరిగుట్ట ఇంచార్జ్ సబ్‌రిజిస్ట్రార్ గోపినాయక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్‌చేశారు. ఇదిలా ఉండగానే ఎమ్మెల్యే భూ ఆక్రమణలకు పాల్పడుతున్నాడని గొంగిడి సునీత విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే ఐలయ్యతో పాటు ఆయన అనుచరులు గొంగిడి సునీతపై విమర్శల దాడికి దిగారు. తన భార్య, మహిళా మాజీ ఎమ్మెల్యే పట్ల అనుచితంగా మాట్లాడుతావా అంటూ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆలేరు ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డారు. నీసంగతి నాకు తెలుసు నోరు విప్పితే.. అంటూ చేసిన ఆరోపణలతో ఒక్కసారిగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య మాటలయుద్ధం తారాస్థాయికి చేరింది.

రాష్ట్రంలో నియంత పాలన

భువనగిరి : రాష్ట్రంలో నియంతపాలన నడుస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం భువనగిరిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ అనుకున్న పనులు చేయలేదని, రండపాలన చేశాడని గతంలో దూషించిన రేవంత్‌రెడ్డి.. రైతులందరికీ రుణమాఫీ చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. రైతుభరోసా ఎగ్గొట్టాడని, తులం బంగారం ఇస్తానని మాట తప్పిన రేవంత్‌రెడ్డి రండ కాదా అని, రాష్ట్రంలో నిజమైన రండపాలన సాగుతుందని ధ్వజమెత్తారు. ఆలేరు ఎమ్మెల్యే ఒక్క రోజులోనే 154 ప్లాట్లు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ఆ పార్టీ ఎమ్మెల్సీనే బట్టబయలు చేశారని పేర్కొన్నారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌పై ఇసుక దందా ఆరోపణలు చేసిన మందుల సామేల్ రోజూ 400 లారీల ఇసుక అక్రమంగా తరలిస్తున్నాడని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదన్నారు. ప్రజావ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకు రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ఆరోపించారు ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన పనులనే ఎమ్మెల్యేలు పూర్తి చేస్తున్నారని, కొత్త పనులే లేవని విమర్శించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, మాజీ జెడ్పీటీసీ మల్లయ్య, జనగాం పాండు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

పథకాలకు అర్హులనే గుర్తించండి

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల సర్వే పారదర్శకంగా చేపట్టి అన్ని అర్హతలు కలిగిన వారినే గుర్తించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్‌తో కలిసి అధికారులతో సమావేశం అయ్యారు. ఈనెల 26న నుంచి ప్రభుత్వం అమలు చేసే పథకాలపై చర్చించి వారికి మార్గదర్శనం చేశారు. రైతుభరోసా కోసం సాగుభూమి కలిగిన రైతులు వివరాలు సేకరించాలని, రియల్‌ఎస్టేట్ భూములు, రోడ్లు, గుట్టలకు అర్హత లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 2023–24 సంవత్సరంలో కనీసం 20 రోజులు పనిచేసిన ఉపాధిహామీ కూలీలను గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సుమారు 50 వేల మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. రేషన్‌కార్డులకు సంబంధించి ఈనెల 15నుంచి ధ్రువీకరణ ప్రక్రియ ప్రారంభించి, 16వ నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. 21వ నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి పథకాలపై డప్పు చాటింపు వేయాలన్నారు. తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, డీపీఓ సునంద, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏడీఏలు, ఆర్‌ఐలు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారంగానే పరిహారం ధర నిర్ణయం

రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం జిల్లా పరిధిలో భూసేకరణ వేగవంతం చేశామని, కొన్ని గ్రామాల్లో రైతులు సానుకూలత వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు. మిగతా గ్రామాల రైతులు కూడా సహకరించాలని కోరారు. భూ నిర్వాసితులకు వీలైనంత అధిక ప్రయోజనం చేకూరే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు కలెక్టర్, అదనపు కలెక్టర్లు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

వేణుగోపాలుడిగా.. గోవర్ధనగిరిధారిగా..



గోవర్ధనగిరిధారి అలంకారంలో ఆలయ మాడ వీధిలో ఊరేగుతున్న స్వామివారు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు రెండో రోజుకు చేరాయి. శనివారం ఉదయం స్వామివారిని శ్రీకృష్ణుడి (వేణుగోపాలస్వామి)గా, సాయంత్రం గోవర్ధనగిరిధారి అలంకారంలో తీర్చిదిద్దారు. అలంకార సేవలను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అర్చకులు స్వామివారి అలంకార విశిష్టతలను భక్తులకు వివరించారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు పాల్గొన్నారు. అదే విధంగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు పాశురాలు పఠించారు.

రక్తమోడుతున్న రహదారులు

ఏడాదిలోనే వందల్లో రోడ్డు ప్రమాదాలు, అదే స్థాయిలో మరణాలు

- మూడు జాతీయ రహదారుల్లోనే 336 మంది మృత్యువాత
- మృత్యు శకటాలుగా.. ఆగి ఉన్న వాహనాలు
- నిద్రలేమి, అతి వేగంతోనూ పెరుగుతున్న ప్రమాదాలు
- రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తోనూ గాల్లో కలుస్తున్న ప్రాణాలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీ కొట్టడంతో డ్రైవర్‌తో పాటు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారంతా ఒడిశాకు చెందిన వలస కూలీలే.

- గత ఏడాది నవంబరు 1వ తేదీన యాదాద్రి జిల్లా దండుమల్కాపురం స్టేజీ వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్స్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పలగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి నర్సింహారెడ్డి, ఆయన భార్య సరోజ అక్కడికక్కడే మృతిచెందారు.
- నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం స్టేజీ సమీపంలో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై గత ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టగా కారులో ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా బలుమూరు మండలం గోద్వాల గ్రామానికి చెందిన గోవింద్ బాలయ్య మృతి చెందగా లింగస్వామి, చందన, నమీజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.
- మిర్యాలగూడ పట్టణంలోని నార్కెట్‌పల్లి – అద్దంకి హైవే బైపాస్‌రోడ్డుపై గత ఏడాది జనవరి 28వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో కారు ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టి, ఎదురుగా వస్తున్న లారీ ముందు పడి, అది కారును కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారు.
- గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి సమీపంలో మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. అదే చోట 2013 జనవరిలో 13 మంది, 2020 ఫిబ్రవరిలో వింజమూరు గ్రామ సమీపంలో మూలమలుపు ఆరుగురు చనిపోయారు.
- ఇవన్నీ ఉమ్మడి జిల్లా పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలకు ఉదాహరణలు మాత్రమే.

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఏడాది కాలంలో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో జరుగుతున్న ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో ఆయా రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ – విజయవాడ(65), నార్కట్‌పల్లి – అద్దంకి, హైదరాబాద్ – వరంగల్ – భూపాలపట్నం, హైదరాబాద్ – ఖమ్మం – కొవ్వూరు (365బీబీ) జాతీయ రహదారి, హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారుల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా 65, 365బీబీ జాతీయ రహదారుల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగితే అదే స్థాయిలో మరణాలు సంభవించాయి. హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలు ప్రమాదాలకు కారణమై మృత్యు శకటాలుగా మారుతున్నాయి. నిద్రలేమి, మరోవైపు అతి వేగంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండగా, మూలమలుపులు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.



ప్రమాదాలకు కారణాలివే..

హైదరాదాద్ –విజయవాడ జాతీయ రహదారి 65పై అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో ప్రధానంగా ఆగి ఉన్న వాహనాలను గమనించకుండా వేగంగా వచ్చి ఢీకొనడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నాయి. జాతీయ రహదారిపై వాహనాలు ఆపే సందర్భంలో రోడ్డు పూర్తిగా దిగి ఆపకపోవడం వల్ల స్పీడ్‌గా వచ్చే వాహనాలు అది గమనించకుండా ఢీకొడుతున్నారు. కొన్ని వాహనాలు రోడ్లపై ఆగిపోవడంతో వాటిని అక్కడి నుంచి తొలగించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాగార్జునసాగర్, దేవరకొండ వంటి ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో పెద్ద ఎత్తున ఉన్న మూలమలుపుల్లో అతివేగం ప్రమాదాలకు కారణం అవుతోంది. రోడ్ల విస్తరణ కావడంతో వాహనాల స్పీడ్ పెద్ద ఎత్తున పెరిగింది. దీంతో ఓవర్ టేక్ చేసే సందర్భంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆగి ఉన్న వాహనాలను దగ్గరకు వచ్చే వరకు గమనించకపోవడం వల్ల ఒకేసారి బ్రేక్‌లు వేసినా కూడా వాహనం కంట్రోల్ కాక ప్రమాదాలు జరుగుతున్నాయి.

వందల సంఖ్యలో మరణాలు

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు 214 మంది మృత్యువాత పడ్డారు. అందులో నల్లగొండ జిల్లా పరిధిలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్, కేతేపల్లి మండలాల పరిధిలో 90 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 92 మంది మృత్యువాత పడ్డారు. సూర్యాపేట జిల్లా పరిధిలో సూర్యాపేట, దురాజ్‌పల్లి, మునగాల, కోదాడ పరిధిలో 170 ప్రమాదాలు జరగ్గా 83 మంది ప్రాణాలు కోల్పోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట నుంచి రెడ్డిబావి వరకు జరిగిన 124 రోడ్డు ప్రమాదాల్లో 39 మంది మరణించారు. ఇక నార్కట్‌పల్లి – అద్దంకి హైవేలో 83 మంది, సూర్యాపేట – ఖమ్మం –కొవ్వూరు హైవేపై జరిగిన 35 ప్రమాదాల్లో 19 మంది మరణించారు. హైదరాబాద్– వరంగల్ – భూపాలపట్నం హైవేలోనూ జరిగిన ప్రమాదాల్లో 20 మంది చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆయా జిల్లాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో 571 ప్రమాదాలు జరగ్గా 610 మంది మరణించారు. దేవరకొండ రోడ్డుతో కలుపుకొని హైదరాబాద్ – చింతపల్లి – నాగార్జున సాగర్ హైవేలో చింతపల్లి, కొండమల్లేపల్లి, పీఏపల్లి, నాగార్జునసాగర్ మండలాల్లో జరిగిన ప్రమాదాల్లో 20 మంది వరకు మరణించారు.

బ్లాక్ స్పాట్‌లను గుర్తించినా..

హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి వెంట 17 చోట్ల బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే ఆయా ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారమైన అండర్‌పాస్‌లు, బ్రిడ్జీలు నిర్మించడంలో ఆలస్యం అవుతోంది. అయితే తాత్కాలిక చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రతి నెల కలెక్టర్‌అధ్యక్షతన రోడ్డు సేఫ్టీ అధికారుల సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.

క్లుప్తంగా

అమరవరపు సతీష్‌కు అరుదైన అవకాశం


అమరవరపు సతీష్

గరిడేపల్లి: మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌కు ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ అవకాశం రావడం సతీష్‌కి ఇది రెండోసారి కావడం విశేషం. తనకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, భారత సంగీత నాటక అకాడమీకి, ప్రధాని నరేంద్ర మోదీకి సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. సతీష్‌ను పలువురు అభినందించారు.

యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం: త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో యంగ్ ప్రొఫెషనల్ ఉద్యోగానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ డిప్లొమా, వ్యవసాయ డిగ్రీ లేదా వ్యవసాయ పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు పూర్తి వివరాలతో ఈ నెల 15వ తేదీన ఉదయం 10:30 గంటలకు కేవీకేలో జరిగే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పరీక్షా పే చర్చ పోటీలకు ఎంపిక


పి. అంజలి

గుర్రంపోడు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను జాతీయస్థాయిలో జరిగే ఎంపిక పోటీలకు గుర్రంపోడు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి. అంజలి ఎంపికైంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కాగా అందులో అంజలి ఒకరు కాగా.. మరొకరు మంచిర్యాల జిల్లాకు చెందిన వారు. ఈ నెల 15న ఢిల్లీలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులతో జరిగే పోటీలో ప్రతిభ కనబర్చితే ప్రధాన మంత్రితో పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం అంజలికి దక్కుతుంది. అంజలితో పాటు గైడ్ శీతల్(సోషల్ టీచర్)ను ఢిల్లీకి వెళ్లనున్నారు. అంజలిని ప్రిన్సిపాల్ జి. రాగిణి, గైడ్ శీతల్, అధ్యాపక బృందం అభినందించారు.

గాలిపటం ఎగరేస్తుండగా విద్యుదాఘాతం

- బాలుడికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం

చౌటుప్పల్ రూరల్: సంక్రాంతి పండుగ పూట విషాదం నెలకొంది. ఇంటి మేడపై గాలిపటం ఎగరవేస్తున్న ఓ బాలుడు విద్యుదాఘాతానికి గురైయ్యాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లంబావి గ్రామానికి చెందిన జెల్ల మధు పెద్ద కుమారుడు దీక్షిత్(10) శనివారం గాలిపటం ఎగురవేయడానికి ఇంటి పైకి ఎక్కాడు. గాలిపటం ఇంటి పక్కనే ఉన్న 11కేవీ కరెంట్ స్తంభానికి చిక్కుకుంది. దీంతో దీక్షిత్ స్టీల్ రాడ్‌తో గాలిపటం తీసే ప్రయత్నం చేశాడు. స్టీల్ రాడ్డుకు కరెంట్ తీగకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్టీల్ రాడ్డు దీక్షిత్ కడుపునకు అనుకుని ఉండడంతో అది అతడి పొట్టలోకి దిగింది. కుడి కాలి వేళ్లు సైతం కాలిపోయాయి. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

యువ వికాసం..

◆ నూతన ఆవిష్కరణలతో యువత ముందడుగు ◆ నేడు జాతీయ యువజన దినోత్సవం

'స్వయం కృషి.. పట్టుదల.. దృఢ సంకల్పం' ఈ మూడూ ఎంచుకున్న రంగంలో మనల్ని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి.
– స్వామి వివేకానంద



యువత తాము ఎంచుకున్న రంగంలో రాణిస్తోంది. చేసే పని ఏదైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు శ్రమిస్తోంది. నూతన ఆవిష్కరణలను సృష్టిస్తూ.. పలువురికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు నెలకొల్పుతూ.. సమాజ సేవలో రాణిస్తూ.. స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. నేడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పలువురిపై ప్రత్యేక కథనాలు.


ఆసు డిజైనింగ్ మిషన్

చేనేత రంగంలో కొత్త యంత్రం..

- కంప్యూటర్‌లో డిజైన్.. ఆసు మిషన్‌కు పెన్ డ్రైవ్..
- నూతన మిషన్‌ను తయారు చేసిన ఆలేరు చేనేత కళాకారుడు నరేందర్

యాదగిరిగుట్ట : చేనేత రంగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ యువ నేతకార్మికుడు నూతన యంత్రాన్ని కనుగొన్నాడు. ఆ యంత్రంతో కార్మికుడికి శ్రమను తగ్గించి.. సమయాన్ని ఆదా చేయడమే కాకుండా.. చేనేత రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్ల వచ్చునని చాటి చెప్పాడు. ఆయనే ఆలేరుకు చెందిన చింతకింది నరేందర్. 2013లో తనకు వచ్చిన ఆలోచనతో 12 ఏళ్లు కష్టపడి చేనేత వస్త్రాల తయారీలో అనుకున్న డిజైన్ రావాలంటే, ఆసుపై డిజైన్ మార్కింగ్‌లో ఉన్న మిషన్‌ను తయారు చేశాడు. పలు ఆటుపోట్లు, ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పటికీ.. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు.

కంప్యూటర్‌లోనే డిజైన్..

గతంలో ఒక చీరపై ఏదైనా డిజైన్ రావాలంటే చేనేత కార్మికులు కూర్చొని, గంటల తరబడి డిజైన్‌ను తయారు చేసే వారు. కార్మికుడు సుమారు 7 నుంచి 8 గంటల వరకు ఒకే దగ్గర కూర్చుని, కిందికి దించిన తలను పైకి ఎత్తకుండా ఏకాగ్రతతో డిజైన్ వేస్తూ పని చేస్తాడు. ఆ తరువాతనే కట్టు కట్టడం, రబ్బర్లు చుట్టడం, రంగులు అద్దడం, కండెలు పోయడం, మగ్గంపై నిలువు, పేక ఒక్క పోగు అల్లుతూ నేయడం చేస్తే చేనేత కార్మికుడు అనుకున్న డిజైన్‌తో ఏదైనా వస్త్రం తయారు అవుతుంది. దీంతో చాలా మంది నేతకార్మికులు మెడ, కంటి నరాలు దెబ్బతినడం, అనారోగ్యానికి గురవుతారు. దీన్ని గమనించిన నరేందర్ కంప్యూటర్ ద్వారా చేనేత


ఆసుపై డిజైన్ చేస్తున్న మార్కింగ్ యంత్రం


చింతకింది నరేందర్

కార్మికుడు అనుకున్న డిజైన్‌ను తయారు చేసుకొని, అందులో ఉన్న డిజైన్ పెన్ డ్రైవ్, మెమోరీ కార్డుల్లో వేసుకొని వస్త్రంపై వచ్చేలా ఆసుపై డిజైన్ మార్కింగ్ వచ్చే యంత్రాన్ని రూపొందించాడు. గ్రాఫ్ కాగితం చేనేత కార్మికుడు కూర్చొని డిజైన్ తయారు చేయడానికి సుమారు 7 నుంచి 8గంటల సమయం పడితే.. ఆసుపై డిజైన్ మార్కింగ్ యంత్రంతో సుమారు 2 నుంచి 3గంటల్లో పూర్తవుతుంది. ఈ యంత్రం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు నేతకార్మికులు ఆరోగ్యంగా ఉంటూ.. అనుకున్న డిజైన్‌ను తయారు చేసి వస్త్రంపై రూపొందించుకునేలా వీలు కలుగుతుంది.

తక్కువ ఖర్చుతోనే..

కంప్యూటర్ ద్వారా డిజైన్ రూపొందించేందుకు తక్కువ సమయంతో పాటు కరెంట్ బిల్లు సైతం తక్కువగా వస్తుంది. ప్రస్తుతం నరేందర్ తయారు చేసిన ఈ యంత్రాన్ని పుట్టపాకకు చెందిన ఎస్.వెంకటేశం అనే చేనేత కార్మికుడికి అందజేశాడు. యంత్రం సాయంతో ఆయన కంప్యూటర్‌లో డిజైన్లు చేసి, చీరెలపై వేస్తున్నాడు. మిషన్‌కు ధర నిర్ణయించలేదు. ఈ మిషన్ ఇప్పుడు తయారు చేస్తే సుమారు రూ.50 వేలు ఖర్చు ఉంటుందని నరేందర్ చెబుతున్నాడు.


గ్రంథాలయంలో పుస్తకాలు, పేపర్ చదువుతున్న పాఠకులు (ఫైల్)

విజ్ఞానాన్ని పంచుతూ..


అనుముల శ్రీనివాస్

చిట్యాల : విజ్ఞానాన్ని పంచేవి గ్రంథాలయాలు. అలాంటి విజ్ఞాన బాండాగారాలను గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పాలనే లక్ష్యంతో ముందుకు సాగాడు ఓ యువకుడు. స్నేహితులు, గ్రామస్తుల సహకారంతో తమ గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా 19 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నాడు. ఇదే స్ఫూర్తితో ఇతర గ్రామాల్లోనూ గ్రంథాలయాల ఏర్పాటుకు సహకరిస్తున్నాడు చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అనుముల శ్రీనివాస్. ఆయన సేవలకుగాను గతేడాది మార్చిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి అందజేసింది. దీంతోపాటు పలు అవార్డులు సైతం పొందాడు.

స్వగ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు

వృత్తి రిత్యా లైబ్రేరియన్ అయిన అనుముల శ్రీనివాస్ గుండ్రాంపల్లి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు తనతో పాటు గ్రామంలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారి నుంచి ఆర్థిక వనరులు సమకూర్చాడు. గ్రామ పెద్దల సహకారంతో భవనాన్ని ఏర్పాటు చేశాడు. 2006 ఏప్రిల్ 14న విద్యావేత్త చుక్క రామయ్య చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభింపజేశాడు. గ్రంథాలయంలో అన్ని దిన, వార పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చాడు. ఇక్కడి గ్రంథాలయంలో చదువుకున్న 30 మంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు.

విపంచి ఫౌండేషన్ ఏర్పాటు

శ్రీనివాస్ తన స్నేహితులతో కలసి క్రీడా పోటీలు, కెరీర్ గైడెన్స్ సమావేశాలు, డెంటల్ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాడు. 2021లో విపంచి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలకు వేలాది పుస్తకాలు, ఫర్నిచర్ అందజేస్తున్నాడు. ఇప్పటి వరకు నల్లగొండ, కరీంనగర్, కడప జిల్లాలోని పది వరకు గ్రంథాలయాల ఏర్పాటుకు సహకారం అందించాడు.

ఉద్యోగం వదిలి.. ఉపాధి కల్పించే స్థాయికి..

భూదాన్‌పోచంపల్లి : ఎంటెక్ పూర్తి చేసి ఆరేళ్లపాటు ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసిన యువకుడు.. వారి కుల వృత్తిపై మమకారంతో హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పి ఆదర్శంగా నిలుస్తున్నాడు. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన సాయిని భరత్ చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు చేస్తున్న చేనేత వృత్తిని చూస్తూ పెరిగాడు. ఆ వృత్తిని పదికాలాల పాటు సజీవంగా ఉంచాలని భావించి.. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి కేంద్ర ప్రభుత్వ చిన్న, లఘు, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహకారంతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కళా పునర్వి పేరిట హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పాడు. దారం నుంచి వస్త్రం వరకు ఇక్కడే తయారవుతాయి. ఈ యూనిట్‌లో 100 మందికి ఉపాధి పొందుతున్నారు. దేశ, విదేశాలకు చెందిన పలువురు అధికారులు, సంస్థలు ఇతని యూనిట్‌ను సందర్శించి అభినందిస్తున్నారు.

నిత్య ప్రయోగశీలి..

ఎంటెక్ చేసిన సాయిని భరత్ నిత్య ప్రయోగశీలి. చేనేతలో నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తున్నాడు. కష్టమర్ల ఆర్డర్‌పై ఎలాంటి డిజైన్ అయిన కంప్యూటర్‌లో రూపొందించి దానిని వస్త్రంపై ఆవిష్కరిస్తున్నాడు. అంతేకాక నాణ్యతమైన వస్త్రాలను రూపొందిస్తూ, దేశంలోని ప్రధాన నగరాలు, షోరూమ్‌లతో పాటు ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సోషల్ మీడియాద్వారా విదేశాలకు సొంతంగా మార్కెటింగ్ చేస్తూ తనకంటూ ఇమేజ్‌ని సంపాదించాడు.


చిటికి కట్టే విధానాన్ని చూపిస్తున్న సాయిని భరత్ (ఫైల్)

నవ సేద్యం


వియత్నంలో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న యువ రైతు యాదగిరి (ఫైల్)

మిర్యాలగూడ : మిర్యాలగూడకు చెందిన కొంపల్లి యాదగిరి బీఎస్సీ పూర్తి చేశాడు. 2015లో థాయ్‌లాండ్, వియత్నం వెళ్లి డ్రాగన్ ఫ్రూట్ సాగులో మెళకువలు నేర్చుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసేందుకు కలకత్తా నుంచి కణుపులను తెప్పించి వేములపల్లి మండలం మొల్కపట్నంలోని తన భూమిలో నాటాడు. దిగుబడి బాగుండడంతో 17 ఎకరాల్లో అదే పంటను విస్తరింపచేసి దేశంలోనే అతిపెద్ద డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేస్తున్నాడు. వచ్చిన దిగుబడిని ముంబై, కలకత్తా, హైదరాబాద్ మార్కెట్లతోపాటు మిర్యాలగూడలో హోల్‌సేల్‌గా కిలో రూ.150చొప్పున అమ్ముతున్నాడు. చదువుకుని ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా స్వతహాగా నూతన వ్యవసాయం చేసి అధిక లాభాలు పొందుతున్నాడు.

హైవేలపై బారులు తీరిన వాహనాలు


చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు


రాత్రి సమయంలోనూ పంతంగి టోల్‌ప్లాజా కొనసాగుతున్న రద్దీ


కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద విజయవాడ రూట్‌లో నిలిచిపోయిన వాహనాలు


చౌటుప్పల్ పట్టణంలో హైవేపై రాత్రివేళ కొనసాగుతున్న వాహనాల రద్దీ

- హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ చేరుకునేందుకు మూడుగంటలు
- టోల్‌ప్లాజాల వద్ద భారీగా ట్రాఫిక్ జాం

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, కోదాడరూరల్, బీబీనగర్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లేవారి వాహనాలతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం రద్దీ కొనసాగింది. హైదరాబాద్ నుంచి తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ స్వస్థలాలకు బయల్దేరారు. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌కు చేరుకునేందుకు మూడు గంటల సమయం పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాలలో జంక్షన్‌ల వద్ద రోడ్డును దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చౌటుప్పల్ పట్టణంలో వాహనాల రద్దీని శనివారం రాచకొండ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షించారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద విజయవాడ వైపు వెళ్లే వాహనాలను 11 కౌంటర్లు ఓపెన్ చేసి పంపిస్తున్నారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి 10గంటల వరకు సుమారు 95వేల వాహనాలు ప్రయాణం కొనసాగించాయి. ఫాస్టాగ్ లేని వాహనాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నగదు కౌంటర్ ద్వారా పంపిస్తున్నారు. టోల్‌ప్లాజా రోడ్డు ప్రారంభమైన దండుమల్కాపురం నుంచి పంతంగి టోల్‌ప్లాజా వరకు ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద పోలీసు సిబ్బంది ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ట్రాఫిక్ డీసీపీ సుర్కంటి మల్లారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. పంతంగి టోల్‌ప్లాజాను సందర్శించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా తీసుకున్న చర్యల గురించి టోల్‌ప్లాజా నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ వాహనాదారులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కొర్లపహాడ్ టోల్‌ప్లాజా నుంచి 55వేల వాహనాలు..

అదేవిధంగా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా నుంచి సాధారణ రోజుల్లో 18 నుంచి 20వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా శనివారం ఒక్కరోజే దాదాపు 55వేల వాహనాలు వెళ్లినట్లు టోల్ నిర్వాహకులు పేర్కొన్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలోని 12 కౌంటర్లలో ఎనిమిది కౌంటర్లను విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. భారీగా వస్తున్న వాహనాలను క్లియర్ చేసేందుకు పోలీసులు, ఆర్టీసీ సిబ్బందితో పాటు ప్రత్యేక సిబ్బందిని టోల్ ఏజెన్సీ నిర్వాహకులు నియమించారు. అదేవిధంగా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మునగాల మండలం మాదారం నుంచి రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్ వరకు ఆరుగురు ఎస్‌ఐలు, 18 మంది సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పాలేరు వంతెన సమీపంలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో వాహనదారులు వేగంగా వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్ మూసివేత...

కోదాడ పట్టణ పరిధిలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్‌ను మూసివేశారు. ఈ క్రాసింగ్ నుంచి చిలుకూరు మండలంలోని దాదాపు ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దానిని బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన అధికారులు విజయవాడ వైపు వాహనాలు ఎక్కువగా వెళ్తుండడంతో వాహనాలు రాకపోకలు సాగించకుండా మూసివేశారు. భారీ వాహనాలను హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ కింద నుంచి, ద్విచక్ర వాహనాలను కట్టకమ్ముగూడెం అండర్‌పాస్ కింద నుంచి మళ్లించారు.


బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద..

గూడూరు టోల్‌ప్లాజా వద్ద..

బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద శనివారం మధ్యాహ్నం నుంచి వాహనాలు బారులుదీరాయి. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు సాయంత్రం సుమారు కిలోమీటర్‌కు పైగా ట్రాఫిక్ నెలకొంది.

నేతన్నకు అభయహస్తం

- చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధి కోసం మూడు పథకాలు అమలు
- రూ.168 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం


మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట: నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సంక్రాంతి కానుకగా రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమగ్రాభివృద్ధి కొరకు రూ.168 కోట్లతో తెలంగాణ నేతన్న పొదుపు, తెలంగాణ నేతన్న భద్రత, తెలంగాణ నేతన్న భరోసా పథకాల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ పథకాలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నేతన్న పొదుపు నిధికి రూ.115కోట్లు, నేతన్న భద్రత కొరకు రూ.9కోట్లు, నేతన్న భరోసాకు రూ.44 కోట్లు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ జీఓ నంబర్ 3 జారీ చేశారు. చేనేత కార్మికుల నుంచి క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను తీసుకొని అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకానికి రూపకల్పన చేసింది.

తెలంగాణ నేతన్న పొదుపు (త్రిఫ్ట్)

తెలంగాణ నేతన్న పొదుపు పథకాన్ని(త్రిఫ్ట్) యథావిధిగా అమలు చేస్తుంది. ఈ పథకం గతంలో కరోనా కష్టకాలంలో చేనేత కార్మికులను ఆదుకుంది. జియో ట్యాగింగ్ కల్గి మగ్గం నేస్తున్న కార్మికుడితో పాటు అనుబంధ కార్మికులు తాము చేస్తున్న వృత్తి నుంచి వచ్చే వేతనాన్ని 8శాతం ఆర్‌డీ–1 అకౌంట్‌లో పొదుపు చేస్తే, ప్రభుత్వం తమ వాటా కింద రెండింతలు అనగా 16శాతం ఆర్‌డీ–2 అకౌంట్‌లో జమ చేస్తుంది. అలాగే పవర్‌లూమ్ కార్మికులు తమ వేతనం నుంచి 8శాతం పొదుపు చేస్తే అంతే మొత్తంలో (8శాతం) ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుంది. ఈ పథకం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మగ్గాలపై ఆధారపడి ఉన్న 25వేల మంది చేనేత కార్మికులకు, అదేవిధంగా మరమగ్గాలపై ఆధారపడిన 6వేల మంది పవర్‌లూమ్ కార్మికులకు కూడా ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకం రికరింగ్ డిపాజిట్ కాలాన్ని 3 నుంచి 2 సంవత్సరాలకు తగ్గించారు. అంటే కార్మికులు తమ పొదుపు చేసిన డబ్బులను రెండేళ్ల తర్వాత తమ అవసరాలకు డ్రా చేసుకొనే వీలు ఉంటుంది.

తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా)

జియో ట్యాగింగ్ కల్గిన చేనేత, మరమగ్గాలపై పనిచేసే కార్మికులతో పాటు అనుబంధ కార్మికులందరికీ నేతన్న భద్రత పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద నమోదైన కార్మికుడు ఏ కారణం చేతనైనా మృతిచెందినా ఆ కుటుంబంలోని నామినీకి రూ.5లక్షల బీమా మొత్తాన్ని అందజేస్తారు. కాగా గతంలో 59 ఏళ్లు ఉన్న చేనేత కార్మికులకే ఈ బీమా పథకం వర్తించేది. కానీ రేవంత్‌రెడ్డి సర్కార్ వయోపరిమితి నిబంధనలను ఎత్తివేసి చేనేత వృత్తిపై ఆధారపడి పనిచేస్తున్న వారందరికి బీమా కవరేజీ అందజేస్తుంది.

తెలంగాణ నేతన్నకు భరోసా

చేనేత కార్మికులకు వేతన ప్రోత్సాహకం అందించాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే జియో ట్యాగింగ్ కల్గి, ప్రభుత్వం అందజేసిన హ్యాండ్లూమ్ మార్క్ లోగోలతో తమ వస్త్రోత్పత్తులను విక్రయించే కార్మికులకు వారి ఉత్పత్తి ప్రమాణాల ఆధారంగా ఏడాదికి గరిష్టంగా రూ.18వేలు, అనుబంధ కార్మికుడికి రూ.6వేలు అందజేయనుంది. ఫలితంగా నేత కార్మికుడికి వేతన మద్దతు లభిస్తుండటంతో వస్త్రాల నాణ్యత కూడా పెంపొందుతుంది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం వార్షిక బడ్జెట్ అంచనా రూ.44 కోట్లు కేటాయించింది.

ఉమ్మడి జిల్లాలో మగ్గాల సంఖ్య ఇలా..

చేనేత మగ్గాలు :

జిల్లా	చేనేత మగ్గాల సంఖ్య
నల్లగొండ	2500
యాదాద్రి భువనగిరి	6771
సూర్యాపేట	150
మొత్తం	9421

❖ ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాలపై ఆధారపడిన వారు సుమారు 25వేల మంది

మర మగ్గాలు :

జిల్లా	మర మగ్గాల సంఖ్య
నల్లగొండ	10,000
యాదాద్రి భువనగిరి	2240
సూర్యాపేట	200
మొత్తం	12,440

❖ ఉమ్మడి జిల్లాలో మర మగ్గాలపై ఆధారపడిన వారు 6వేల మంది

హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్స్..

అలాగే తెలంగాణలోని చేనేత వస్త్రాల ఘన వారసత్వాన్ని, సంప్రదాయ ప్రతిష్టను పెంచడం, దేశ, అంతర్జాతీయ మార్కెట్ లో ప్రత్యేక గుర్తింపు, సముచితమైన మార్కెటింగ్‌ను సృష్టించడానికి ప్రభుత్వం హ్యాండ్లూమ్ మార్క్ లేబుల్‌ను రూపొందించింది. దాంతో కొనుగోలుదారుడికి కూడా ప్రామాణికత, నాణ్యతపరమైన హామీ అందుతుంది. తెలంగాణ హ్యాండ్లూమ్ మార్క్ లేబుళ్లకు ప్రభుత్వం వార్షిక బడ్జెట్ కూ. 4 కోట్లు కేటాయించింది.

ఎంతో సంతోషంగా ఉంది



కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. పోచంపల్లిలో అధికంగా ఉన్న చేనేత కార్మికులకు మేలు చేకూరుతుంది. త్రిఫ్ట్ పథకం మెచ్యూరిటీ కాలాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
– అంకం పాండు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు, భూదాన్‌పోచంపల్లి